క్లుప్తంగా

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



గుండాబత్తుల సుబ్బారావు

ఉండి: అకాల వర్షాల వలన తడిసిన ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం తప్పనిసరిగా కొనుగోలు చేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రైతు గుండాబత్తుల సుబ్బారావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇదే అదునుగా ధాన్యం తడిసిన సంగతిని సాకుగా చూపి మిల్లర్లు, మధ్యవర్తులు రైతులను దోచుకునేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. రైతులను ఆదుకోవాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే అకాల వర్షాల వలన తీవ్రంగా నష్టపోతున్న రైతులను వెంటనే ఆదుకోవాలన్నారు. అకాల వర్షాలు మధ్యవర్తులకు వరంలా మారుతున్నాయని దానిని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి వరి రైతులను ఆదుకోవాలన్నారు. అలాగే ఆక్వా, మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం



నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న సాయినాథ్ దంపతులు

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీమావుళ్లమ్మ శాశ్వత నిత్యాన్న దానానికి గ్రంధి చంద్ర వెంకట సాయినాథ్, పద్మ దంపతులు రూ.1,01,116 విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు కొప్పేశ్వరరావు పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, ఫొటో అందజేశారు.

అమ్మవారికి వెండి సమర్పణ



వెండిని సమర్పిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలా త్రిపుర సుందరి అమ్మవారి వెండి పీటానికి దాతలు 100 గ్రాముల వెండిని విరాళంగా సమర్పించారు. బుధవారం భీమవరానికి చెందిన బండారు వెంకట సుబ్బారావు దంపతులు 50 గ్రాములు, గుత్తి గణేష్ మనోహర్ దంపతులు 50 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ ఆలయ అభివృద్ధికమిటీకి అందించారు. ఆలయ అర్చకులు పూజలుచేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో భక్తులు సభ్యులు పాల్గొన్నారు.

నేడు కాళ్లకూరు వెంకన్న కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

కాళ్ల: కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభు శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో రెండో రోజు బుధవారం ఉదయం నిత్యోపాసన, పంచ సూక్తహనం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను వధూ వరులుగా అలంకరించి సహస్ర తులసీదళార్చన, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. సాయంత్రం స్వామి వారికి ఎదుర్కోలు (రాయబార మహోత్సవం) సన్నాహం వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం కార్య నిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.

భవన నిర్మాణ కార్మికులకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ జ్యోతి

పాలకోడేరు: అసంఘటిత కార్మికులకు అనేక చట్టాలు రూపొందించబడ్డాయని, వాటిని సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత ప్రతి కార్మికుడిపై ఉందని భీమవరం రెండో అదనపు జుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి అన్నారు. మండలంలోని కుముదవల్లి గ్రామ సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సుకు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని కార్మిక చట్టాలు, అటల్ పెన్షన్ యోజన, సురక్ష బీమా యోజన, తదితర పథకాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్, ప్యానల్ న్యాయవాది పి.అంబేడ్కర్, ఎస్సై-2 ఎస్.హరిబాబు, సర్పంచ్ భూపతిరాజు వంశీ కృష్ణంరాజు, పంచాయతీ సెక్రటరీ వై.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో భూమి సారవంతం

- పంటలో తెగుళ్లు దూరం
- అధిక దిగుబడులు సాధించొచ్చంటున్న రైతన్నలు
- తెగుళ్ల వ్యాప్తి నివారించొచ్చంటున్న వ్యవసాయాధికారులు



దిరుసుమర్రులో వేసవి దుక్కులు దున్నుతున్న రైతులు

భీమవరం అర్బన్: మండలంలో అక్కడక్కడ పంట పొలాల్లో రైతులు ట్రాక్టర్లతో వేసవి దుక్కులు దున్నుతున్నారు. దీంతో తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకోవడమే కాకుండా అధిక దిగుబడులు సాధించొచ్చని రైతులు చెబుతున్నారు. మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, తుమ్మగొప్పు, కొమరాడ, అనాకోడేరు, చినఅమిరం, తాడేరు, బేతపూడి, గునుపూడి, రాయలం తదితర గ్రామాల్లో సుమారు 7300 ఎకరాల్లో దాళ్వా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం దాళ్వా మాసూళ్లు దాదాపు ఒబ్బిడైపోవడంతో రైతులు తమ పొలాల్లోని ఎత్తు పల్లాలను చదును చేసుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. అలాగే వేసవి కావడంతో రైతులు తమ పొలాలను ట్రాక్టర్ల సహాయంతో దున్నుతూ నేలను పైకికిందికి కలయబెడుతున్నారు. ఇలా చేయడం వలన నేలల్లో పోషకాలు పైకి రావడంతో దిగుబడి పెరుగుతుందని రైతులు చెబుతున్నారు.

వేసవి దుక్కులతో తెగుళ్లు దూరం

వ్యవసాయ పంటలో కాండం తొలుచు పురుగులు, ఆకు ముడత పురుగులు, కాండం కుళ్లు తెగులకు కారకాలైన పురుగులు గుడ్లు పొదిగి నేలల్లో ఉండడం వలన తదనంతరం వచ్చే పంటలో మళ్లీ ఆ తెగులు వ్యాప్తి చెంది పంట నాశనం చేస్తాయని రైతులు చెబుతున్నారు. వేసవిలో దుక్కులు దున్నడం వలన ఆ తెగులు జాతికి చెందిన బీజాలు వేడికి చనిపోవడంలేదా పక్షులు తినడంతో పంటకు తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. అంతే కాకుండా మొండి జాతికి చెందిన గడ్డి మొక్కలు ఇతర కలుపు మొక్కల మూలాలు ఎండ దెబ్బకు మాడిపోతాయని రైతులు చెబుతున్నారు. దీంతో వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించొచ్చంటున్నారు. నేల సారవంతమవుతుందంటున్నారు. రైతులు సార్వా పంట అవ్వగానే దాళ్వా సాగుకు వెనువెంటనే ఆరంభించడంతో భూమి సారం కోల్పోయి పంట దిగుబడి తగ్గిపోతుందని వేసవిలో దుక్కులు దున్నడం వలన భూమి సారవంతమవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

వేసవి దుక్కులతో రైతన్నకు మేలు



వేసవి దుక్కులు దున్నడం వలన పంటలో తెగుళ్ల వ్యాప్తి నివారించొచ్చు. గత పంటలో ఉన్న తెగుళ్ల బీజాలు నిర్మూలించడమే కాకుండా నేల సారవంతమవుతుంది. మొండి కలుపు మొక్కలను నివారించి, పంటలో అధిక దిగుబడి సాధించొచ్చు. గత పంట కాలంలో కాండం తొలుచు పురుగు, మొవ్వ పురుగు, గొంగళి పురుగులు బయటకు వచ్చి చచ్చిపోతాయి. ఖర్చును కూడా తగ్గించుకోవచ్చు. రైతులు వేసవి దుక్కులు చేయడం వలన సాగులో ఎంతో మేలు కలుగుతుంది.

– నిమ్మల శ్రీనివాస్, వ్యవసాయాధికారి, భీమవరం మండలం

ఎత్తు పల్లాలను సరి చేసుకుంటున్న రైతులు

వేసవి కావడంతో పొల్లాల్లో ఎత్తు పల్లాలను సరి చేసుకుంటే వచ్చే సార్వా పంటలో వరదలు, భారీ వర్షాలు రానున్న నేపథ్యంలో పొలాల గట్లను, ఎత్తు పల్లాలను సరిచేస్తున్నారు. ముందుగానే పొలం పనులు చేయడం వల్ల దిగుబడి సాధించొచ్చని రైతులు పేర్కొంటున్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు

ఉండి: ఈ నెల 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఉండి గ్రామంలో వేంచేసియున్న అలివేలు మంగ భూసమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వహణాధికారి తోట శ్రీనివాసరావు తెలిపారు. 8వ తేదీన అంకురార్పణ, ధ్వజారోహణతో కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 10వ తేదీన స్వామి వారి కల్యాణం, చివరి రోజైన 13వ తేదీ రథోత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని శ్రీనివాసరావు తెలిపారు.

పునః ప్రతిష్ఠ మహోత్సవ ఏర్పాట్ల పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీరామలింగేశ్వర స్వామి (సుబ్బారాయుడి గుడి) దేవస్థాన పునః ప్రతిష్ఠ మహోత్సవ ఏర్పాట్లను బుధవారం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పరిశీలించారు. గురువారం ఉదయం 6.55 గంటలకు దేవస్థాన పునః ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తారని, భక్తులు పాల్గొనాలన్నారు. ఈ మేరకు బుధవారం దాతలు సుమారు రూ.5.60 లక్షలను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా దేవస్థాన పునర్నిర్మాణ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల కూల్చివేతపై ఆమరణ నిరాహార దీక్ష



నిరాహార దీక్షను చేపట్టిన సీపీఎం నాయకులు

పాలకోడేరు: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పేదల ఇళ్ల కూల్చివేత సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకులు మంతెన సీతారాం అన్నారు. పాలకోడేరు అల్లూరి సీతారామరాజు నగర్‌లో పేదల ఇళ్ల కూల్చివేతను నిరసిస్తూ సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు కూల్చిన ఇళ్ల శిథిలాలపై నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజు కాలువ పేదల ఇళ్ల వలన కలుషితం అవుతుందనేది వాస్తవం కాదన్నారు. రఘురామకృష్ణరాజుకు అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి ఉంటే కాలుష్య నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టాలో తెలుసుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రఘురామకృష్ణరాజు అరాచకాలను నియంత్రించకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయ, కె.క్రాంతి బాబు, శేషపు ఆశ్రియ్య, ధర్మేంద్ర, పుచ్చకాయల రత్నంరాజు, కొర్ర శ్రీనివాస్ యాదవ్, బొక్కా సత్యనారాయణ, దున్న మరియమ్మ, బాధితులు మల్లుల దుర్గారావు, పెచ్చెట్టి సత్యనారాయణ, దొంగ నాగరాజు, మెట్టా రామారావు, మల్లుల పద్మ, పైడి ఆదిలక్ష్మి, జోగి నాగలక్ష్మి, గుడాల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ గోడౌన్‌ను తనిఖీ చేసిన జేసీ



రికార్డులను పరిశీలిస్తున్న జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం: ఉండి మండలం, మహాదేవపట్నంలో ఉన్న ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎక్సైజ్ లిక్కర్ గోడౌన్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి బుధవారం తనిఖీ చేసి, స్టాక్, మేనేజ్‌మెంట్‌ను పరిశీలించారు. లిక్కర్, బీరు డిమాండ్, సప్లై ఏ విధంగా ఉందని డిపో మేనేజర్‌ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. తనిఖీలో డిపో మేనేజరు ఎల్.రంగారెడ్డి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రమేష్, స్టోర్ ఆఫీసర్ సి.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ పేరుతో కూటమి దగా



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

భీమవరం: కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలి ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి తీవ్రంగా దుయ్యబట్టారు. బుధవారం భీమవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళలకు అండగా ఉంటామని చెప్పి ఉచిత బస్ ప్రయాణం అంటూ ఊదరగొట్టి కూటమి అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచిపోయినా ఇంత వరకు అమలు చేయకపోగా మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ పేరుతో భారీ కుంభకోణానికి తెరతీశారని ఆమె ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు, ఇంట్లోని ప్రతి మహిళకు నెలకు రూ.1,500, విద్యా దీవెన పథకంలో ఒక్కొక్కరికి రూ.20 వేలు ఇస్తామని ఇచ్చిన హామీలు నాయకులు మర్చిపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు అండగా నిలిచి, వారి ఖాతాల్లో నేరుగా సంక్షేమ పథకాల సొమ్ము జమ చేశారని గుర్తు చేశారు.

అంబరాన్నంటిన వాసవీ మాత సంబరాలు



ఆకివీడు:త్యేక అలంకరణలో దర్శనమిస్తున్న వాసవీమాత అమ్మవారు



భీమవరం (ప్రకాశంచౌక్): కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

ఆకివీడు: వాసవీమాత జయంతోత్సవాలు బుధవారం అంబరాన్నంటాయి. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద వేంచేసియున్న అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆనాల చెరువు వద్ద నుంచి కలశాలతో మహిళలు ఊరేగింపుగా జలాలు తీసుకొచ్చి అభిషేకం చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. 108 రకాల పిండి వంటలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

400 మంది సుహాసినీలతో కుంకుమార్చన

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీవాసవీకన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా త్యాగ రాజ భవనంలో ఆర్యవైశ్య వర్తక సంఘం బుధవారం 400 మంది సుహాసినీలతో కుంకుమార్చన నిర్వహించారు. వబిలిశెట్టి వెంకటేశ్వర్రావు, తటవర్తి బదిరీ లక్ష్మీ నారాయణ, కురిశేటి సత్యనారాయణ మూర్తి, విజయభాస్కర్, పూసరపు సుబ్బారావు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

భీమవరం: రహదారి భద్రతా నియమాలు, హెల్మెట్ వినియోగం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడానికి బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య మాట్లాడుతూ వాహన చోదకులు రహదారి భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఎం.నాగరాజు, రూరల్ సీఐ బి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్సైలు రెహమాన్, వీర్రాజు పాల్గొన్నారు.

భీమవరం (ప్రకాశం చౌక్): రాధాకృష్ణ ఆటోమోటివ్స్ వర్మ గ్రూప్ (రాయల్ ఎంఫిల్డ్) సంస్థ సామాజిక సేవల్లో ముందుకు సాగడం అభినందనీయమని డీఎస్పీ ఆర్.జయసూర్య అన్నారు. భీమవరం రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరుమ్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన చలివేంద్రం, హెల్మెట్ అవగాహన ర్యాలీని డీఎస్పీ జి.జయసూర్య ప్రారంభించారు. కార్యక్రమంలో వర్మ గ్రూప్ ఎండీ మధువర్మ, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్

భీమవరం: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా డాక్టర్ వైఎస్ఆర్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇచ్చారు. కేజీఆర్‌ఎల్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ మాజీ హెచ్‌వోడీ జి.విజయ్ విద్యార్థులకు ఇంగ్లిష్ పదాలను ఏ విధంగా మాట్లాడాలో నేర్పించారు.

ఉగ్రవాదాన్ని తుది ముట్టించాల్సిందే

ఆకివీడు: పాకిస్తాన్‌లో ఉగ్రవాద సంస్థల నివాసాలపై భారత్ సైనిక బలగాలు మంగళవారం అర్ధరాత్రి చేసిన దాడుల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉగ్రవాదాన్ని తుదిముట్టించాలని కోరుతున్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాక్‌లోని ఉగ్ర సంస్థలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు వెనుకంజ వేస్తూ వస్తున్నాయని, ఇప్పటికైనా ఉగ్రవాదాన్ని ఉపేక్షించకుండా అంతం చేయాలని కోరుతున్నారు.

ఉగ్రవాదాన్ని అంతం చేయాలి



ఉగ్రవాదాన్ని తుదిముట్టించాల్సిన తరుణం ఇదే. భారత్ తీసుకున్న సరైన నిర్ణయాన్ని ప్రజలు ముక్తకంఠంతో స్వాగతిస్తున్నారు. ప్రతి భారతీయుడిలో రగిలిపోతున్న భావోద్వేగం ఉగ్రవాదంపై ఉక్కుపాదమే. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రపంచ దేశాలు మద్దతు ఇవ్వడంతో ఉగ్రవాదానికి అంతమే. ముస్లిం పార్టీలతో సహా అన్ని పార్టీలు దేశానికి మద్దతు ఇస్తుంటే కాంగ్రెస్ అధ్యక్షుడు ఖార్గే చేస్తున్న ఆరోపణలు దారుణం.

– నేరెళ్ల పెదబాబు, వ్యాపారవేత్త, ఆకివీడు

ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టాలి



ఉగ్రవాదాన్ని తుడిచి పెట్టాలి. మానవత్వం కోల్పోయిన కొంత మంది మృగాలకన్నా దారుణంగా ప్రవర్తిస్తూ సభ్య సమాజంలో మనుషులను పశువుల కన్నా దారుణంగా చంపడం క్షమించరాని నేరం. ఖురాన్ ఇటువంటి దారుణాలను క్షమించదు. ఉగ్రవాదానికి మద్దతిచ్చే వారిని క్షమించకూడదు. మన ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ప్రతి ముస్లిం హర్షిస్తున్నారు.

– ఎస్‌కే ఆరీఫ్, ముస్లిం నాయకుడు, ఆకివీడు

అభివృద్ధికి గుదిబండ



ఉగ్రవాదం, నక్సలిజం వంటివి దేశ అభివృద్ధికి చీడ పురుగులు వంటివి. వీటిని కూకటి వేళ్లతో పీకివేయాలి. పాకిస్తాన్‌లో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న విషయం యావత్ ప్రపంచానికి తెలుసు. ఆపరేషన్ సింధూర్ చర్యలు భారత దేశానికే కాదు, ప్రపంచానికీ మంచి మేలు చేస్తాయి. ఇటువంటి సంఘటనలకు దేశ ప్రజలు ముక్తకంఠంతో మద్దతు తెలపడం అభినందనీయం.

– ఎస్.హర్ష, యువకుడు, ఆకివీడు

ధాన్యం కొనుగోలుకు టార్గెట్ నిల్

లబోదిబోమంటున్న రైతులు



సిద్ధాపురం రైతుసేవా కేంద్రం వద్ద నిలిచిపోయిన ధాన్యం లోడు ట్రాక్టర్లు

ఆకివీడు: రైతుల వద్ద నుంచి ప్రతి గింజా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటనలిస్తున్నా, ఆచరణలో మాత్రం అమలు కావడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని రైస్ మిల్లులన్నింటి వద్ద టార్గెట్ పూర్తయింది. దీంతో ఆన్‌లైన్‌లో ఆయా మిల్లులకు ధాన్యం విక్రయించేందుకు డేటా అంగీకరించకపోవడంతో రైతులు ధాన్యం ట్రాక్టర్లతో రైతుసేవా కేంద్రాల వద్ద పడుగాపులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి, మాసూళ్ల ఆలస్యం అయిన ప్రాంతాల్లోని ధాన్యాన్ని ఆయా రైతుసేవా కేంద్రాల వద్దకు సోమవారం నుంచి తీసుకొస్తున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని మండలంలోని ఏ మిల్లుకైనా విక్రయించి, త్వరితగతిన దిగుమతి చేయించుకోవాలని మొరపెడుతున్నారు. ఈ విషయంపై జిల్లా జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడగా మండలంలోని రైస్ మిల్లుల సామర్థ్యాన్ని బట్టి టార్గెట్ ఇచ్చామని, అది పూర్తయిందన్నారు. ఇప్పటికే బ్యాంక్ గ్యారంటీ కన్నా అదనంగా ఆయా మిల్లులకు కోటా ఇచ్చామన్నారు. రైతులు ఇతర మండలాల్లోని మిల్లులకు ఎక్కడ ధాన్యం విక్రయించినా వారికి కిరాయి, ఇతర ఖర్చులు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇతర మండలాలకు వెళ్లి ధాన్యాన్ని ఆయా రైస్ మిల్లులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

సంచుల కొరత తీవ్రం

మిల్లర్లకు, రైతులకు సంచుల కొరత తీవ్రంగా కన్పిస్తుంది. రైతులకు చినిగిన, నాసిరకం సంచులను అందజేయడంతో ధాన్యం కారిపోతుందని, గడ్డి కూరుకుని తీసుకు రావలసి వస్తుందని వాపోతున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన మిల్లర్లు ఎఫ్‌సీఐకి సీఎమ్మార్ బియ్యం చెల్లించేందుకు కొత్త సంచులు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిసింది. దీంతో కన్‌సైన్‌మెంట్‌లు అవ్వక, బిల్లులు రాక బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. రైతులకు, మిల్లర్లకు సంచుల కొరతను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

సొంత పనులకు పంచాయతీ ట్రాక్టర్

ఉండి: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ అవసరాల కోసం ప్రభుత్వం అదించిన ట్రాక్టర్‌ను ఓ వ్యక్తి సొంత పనులకు వినియోగించడంతో పంచాయతీ కార్యదర్శి జేవీటీ నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ వార్డు సభ్యురాలి భర్త కూటమి నాయకుడు బాలకృష్ణకు చెందిన వరికోత యంత్రం పొలంలో దిగబడిపోయింది. అతడి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న మారియ్య వరికోత యంత్రాన్ని బయటకు లాగేందుకు పంచాయతీ ట్రాక్టర్‌ను మారుతాళంతో తీసుకెళ్లారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి డ్రైవర్ మారియ్యపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

అ'పూర్వ' కలయిక

కాళ్ల: సుమారు 22 ఏళ్ల క్రితం 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల కలయికకు ఏలూరుపాడు హైస్కూల్ వేదికైంది. 2003–04 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం ఒక చోట కలిశారు. స్నేహబంధం ఎంత మధురమో అంటూ వారు పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఆత్మీయ కలయికకు కృషి చేసిన స్నేహితులను తోటి విద్యార్థులు అంతా అభినందించారు.

అల్లూరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



భీమవరం (ప్రకాశంచౌక్): అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భీమవరం అర్బన్: అల్లూరి సీతారామరాజు జీవితాన్ని, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ అన్నారు. మండలంలోని కొత్తపూసలమర్రులో బుధవారం అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరుమాని కామేశ్వరరావు, తిరుమాని శ్రీరాములు, బర్రె నాగరాజు, అబ్రహాం, వాటాల రాధాకృష్ణ, తిరుమాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉద్యమాల విధానాలకు స్ఫూర్తి అల్లూరి సీతారామరాజు

భీమవరం (ప్రకాశంచౌక్): ఉద్యమాల విధానాలకు స్ఫూర్తి అల్లూరి సీతారామరాజని, మన్యం ప్రాంతంలో ఉద్యమం సాగించి బ్రిటిష్ వారిని గడగడలాడించారని అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు అన్నారు. నరసయ్య అగ్రహారంలోని అల్లూరి విగ్రహం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గాదిరాజు సాయి రాజు, గాదిరాజు రామలింగరాజు, సూర్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో..

భీమవరం: జన విజ్ఞాన వేదిక పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జేవీవీ సీనియర్ నాయకులు వై.అజయ్ కుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. చింతపల్లి ప్రసాదరావు, జె.రామలక్ష్మణరావు, మల్లుల శ్రీనివాస్, చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్నబాబు, బొర్రా నాగబాబు, ఫణి రాజేష్, కె.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.



భీమవరం: అల్లూరి వర్ధంతిని నిర్వహిస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు



భీమవరం అర్బన్: అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

ధాన్యం తరలింపునకు వాహనాలు ఏర్పాటు చేయాలి

భీమవరం: ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వాహనాలు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం తరపున జేసీ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశామని మామిడిశెట్టి రామాంజనేయులు తెలిపారు.